www.prajasakti.com
ప్రజాశక్తి
శుక్రవారం 9 మే 2025
5
వైఎస్ఆర్

రిమ్స్ ప్రిన్సిపల్‌గా డాక్టర్ జమున బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - కడప సిటీ

కడప ప్రభుత్వ వైద్య కళాశాల (రిమ్స్) ప్రిన్సిపల్‌గా డాక్టర్ జమున గురువారం బాధ్యతలు చేపట్టారు. ఆమెకు పూర్వ ప్రిన్సిపల్ సురేఖ, సూపరింటెండెంట్ జి.రమాదేవి, అడ్మినిస్ట్రేటర్, డిప్యూటీ కలెక్టర్ రంగస్వామి, కాంట్రాక్టర్ బాల నారా యణరెడ్డి, అన్ని విభాగాల అధిపతులు, వైద్యులు, వైద్య సిబ్బంది స్వాగతం పలికారు. అనంతరం ఆమెను వారు పూలబొకెలు, శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నూతన ప్రిన్సిపల్ మాట్లాడుతూ అందరి సహకారంతో రిమ్స్ కళాశాల అభివృద్ధికి కృషి చేస్తామని చెప్పారు. ప్రజలకు అందించే వైద్య సేవలను , వైద్య విద్యార్థుల వైద్య విద్యను తమ వంతుగా అభివృద్ధి చేస్తామని తెలియజేశారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని

కార్పొరేషన్ కార్యాలయం ముట్టడి

- ఉద్రిక్తత, ఇద్దరు కార్మికులకు గాయాలు
- కమిషనర్ హామీతో దీక్ష విరమణ

ప్రజాశక్తి - కడప అర్బన్

మున్సిపల్ కార్మికుల న్యాయమైన డిమాండ్లను తీర్చాలని, వారి సమస్యలను పరిష్కరించాలని గురువారం కార్పొరేషన్ కార్యాలయాన్ని ముట్టడించారు. ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు అనుబంధం) నగర కమిటీ ఆధ్వర్యంలోనిర్వహించారు. డ్రైవర్ల సంఘం అధ్యక్షులు సుంకర కిరణ్ ముట్టడికి అధ్యక్షత వహించారు. ముట్టడి సందర్భంగా నాయకులు, కార్మికులు కార్పొరేషన్ కార్యాలయంలోకి వెళ్లేందుకు ప్రయత్నించారు. పోలీసులు అడ్డుకోవడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ముట్టడి సందర్భంగా ఇద్దరు కార్మికులకు గాయాలయ్యాయి. ఈ సందర్భంగా సిఐటియు నగర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు చంద్రారెడ్డి, వెంకటసుబ్బయ్య, మున్సిపల్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు కంచుపాటి తిరుపాల్, నగర అధ్యక్షుడు సుంకర రవి, వర్కింగ్ ప్రెసిడెంట్ కంచిపాటి శ్రీరామ్, ఇత్తడి ప్రకాష్ మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులకు 60 ఏళ్లు వయసు ఉందని చిల్లి గవ్వ కూడా ఇవ్వకుండా, ఎటువంటి బెనిఫిట్స్ లేకుండా రిటైర్మెంట్ చేసి పంపించడం దారుణమన్నారు. వారికి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం, బెనిఫిట్స్ రూ.10 లక్షలు, ఫించను రూ.10వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇంజినీరింగ్ సెక్షన్ కార్మికులకు జీవో నంబర్ 36 ప్రకారం రూ.24,500 ఇవ్వాలని పేర్కొన్నారు. అకేషనల్ కార్మికులకు పిఎఫ్, ఇఎస్ఐతో కూడిన రూ.21వేల వేతనం ఇవ్వాలని తెలిపారు. డ్రైవర్‌గా పని చేస్తున్న తొమ్మిది మందికి జీవో నంబర్ 36 ప్రకారం వేతనాలు ఇవ్వకపోవడం దారుణమని చెప్పారు. వర్కర్స్ నుంచి డ్రైవర్‌గా ప్రమోట్ అయిన వారితో డ్రైవింగ్ చేయించుకుంటూ వారిని డ్రైవర్లుగా కూడా గుర్తించడం లేదని వాపోయారు. ప్రమోషన్లు, ఇంక్రిమెంట్లు, సరెండర్ లీవులు ఏ ఒక్కటి కూడా పర్మనెంట్ వాళ్లకు ఇవ్వడంలేదని చెప్పారు. ఆప్కాస్ రద్దు చేస్తే కార్మికులందరినీ రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. ఆప్కాస్ కార్మికులు, రిటైర్డ్ అయ్యి వారికి రాష్ట్ర ప్రభుత్వంతో సంబంధం లేకుండా కడప నగరపాలక సంస్థ నుంచి రూ.5లక్షలు బెనిఫిట్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనువర్తిమైతే ఈనెల 20 నుంచి దీర్ఘకాలిక సమ్మెకు వెళ్తామని హెచ్చరించారు. ప్రభుత్వం స్పందించి సమస్యలు పరిష్కరించాలని కోరారు.

కమిషనర్ హామీతో దీక్షవిరమణ

కడప నగర పాలక సంస్థ కమిషనర్ మనోజ్ రెడ్డి దీక్షా శిబిరం వద్దకు చేరుకుని కార్మికులతో మాట్లాడారు. సిఐటియు నాయకులు చేస్తున్న డిమాండ్లు న్యాయమైనవని చెప్పారు. మేయర్ సురేష్ బాబు, తాను స్టాండింగ్ కమిటీలో ఆప్కాస్ కార్మికుల రిటైర్డ్ అయ్యే వారి కుటుంబంలో ఒకరికి అడిషనల్ వర్కర్స్‌గా ఉద్యోగం ఇవ్వాలని తీర్మానం చేశామని పేర్కొన్నారు. ఇంజినీరింగ్ సెక్షన్ కార్మికులకు జీవో నంబర్ 7 ప్రకారం ఇవ్వడానికి మరో మారు మేయర్‌తో మాట్లాడుతానని చెప్పారు. అడిషనల్ కార్మికులకు పిఎఫ్, ఇఎస్ఐ గురించి

ముట్టడిని ఉద్దేశించి మాట్లాడుతున్న సిఐటియు నగర ప్రధాన కార్యదర్శి వెంకటసుబ్బయ్య

చర్చించామని తెలిపారు. 9 మంది డ్రైవర్లకు కూడా ఇప్పటికే అనేకసార్లు రాష్ట్ర ప్రభుత్వానికి జీవో నంబర్ 36 ప్రకారం వేతనాలు ఇవ్వాలని రాసి పంపించామని పేర్కొన్నారు. మరోసారి రాష్ట్ర ప్రభుత్వం, కడప ఎమ్మెల్యే, మేయర్, అధికారులతో మాట్లాడతానని హామీ ఇచ్చారు. మిగిలిన సమస్యల పై శుక్రవారం కార్మికులు, సిఐటియు నాయకులతో కూర్చొని చర్చిస్తామన్నారు. అనంతరం శిబిరం దగ్గరికి వచ్చి 24 గంటలు నిరాహార దీక్ష చేస్తున్న వారికి కమిషనర్, సిఐటియు నగర ప్రధాన కార్యదర్శి వెంకటసుబ్బయ్య నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింపచేశారు. కార్యక్రమంలో డ్రైవర్ అధ్యక్షుడు శ్రీధర్ బాబు, డ్రైవర్లు నాగరాజు, మస్తాన్, శీను, రాజా,హరి, పెంచలయ్య, నాగరాజు, ఆనంద్, ఆదాము, బాలాజీ, ఆసి బాబు, రమేష్, పెద్దోడన్న, నారాయణ, జై సింహ, హజరత్ శివ,వరప్రసాద్, ధరణి, సాయమ్మ,పూజారమ్మ, కార్మికులు మహిళా కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలను విస్మరించిన ప్రభుత్వం

యూనియన్ జిల్లా అధ్యక్షులు కె.నాగేంద్రబాబు

ప్రజాశక్తి - బద్వేలు

మున్సిపల్ కార్మికుల సమస్యలను కూటమి ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షులు కె. నాగేంద్రబాబు పేర్కొన్నారు. మున్సిపల్ ఉద్యోగ- కార్మికుల సమస్యల పరిష్కారం కోసం రాష్ట్రవ్యాప్త నిరసనలో భాగంగా బద్వేల్ మున్సిపల్ యూనియన్ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి పది నెలలు గడుస్తున్నప్పటికీ మున్సిపల్ కార్మికులకు గత రాష్ట్రవ్యాప్త సమ్మె సందర్భంగా ప్రభుత్వం అంగీకరించిన ఒప్పందాలకు జీవోలు జారీ చేయకపోవడం, కార్మికులకు వెన్నుదన్నుగా ఉన్న ఆప్కాస్ సంస్థను సైతం రద్దు చేసి ప్రయివేట్ ఏజెన్సీలకు అప్పగించాలని ప్రోత్సహించడం దారుణం. 60 సంవత్సరాలు నిండిన కార్మికులను బలవంతంగా ఉద్యోగ విరమణ చేయించడం కూటమి ప్రభుత్వానికి సరైంది కాదని పేర్కొన్నారు. ఈ చర్యలన్నీ కార్మిక వర్గాన్ని విస్మరించడమేనని విమర్శించారు. ఇప్పటికైనా బడుగు బలహీన వర్గాల కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు మున్సిపల్ అధికారులు కృషి చేయాలని లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలకు శ్రీకారం చుడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిఐటియు పట్టణ నాయకులు ముదియం చిన్న గంగనపల్లి నాగార్జున, షేక్ ఆదిల్, గంప సుబ్బరాయుడు, షేక్ మస్తాన్ బీ,మూల ప్రసాద్, యూనియన్ పట్టణ అధ్యక్షులు పులి శ్యామ్ ప్రవీణ్, కార్యనిర్వాహక అధ్యక్షులు దియ్యాలవారే, ఉపాధ్యక్షులు గంటా శ్రీనివాసులు, దియ్యాల దేవమ్మ, సహాయ కార్యదర్శులు నాగరాజు సత్యరాజు, బద్వేల్ ప్రవీణ్ కుమార్, కోశాధికారి కలువ శివకుమార్, కార్మికులు కలివేల విజయ్, అమిలిపోగు బాబు, దియ్యాల వెంకటేష్ పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు తెలుసుకుంటున్న కమిషనర్ మనోజ్‌రెడ్డి

ఘోర రోడ్డు ప్రమాదం

- కంటైనర్‌ను ఓవర్‌టేక్ చేయబోయి..
వాహనం కింద పడి ముగ్గురు మృతి
- మృతుల కుటుంబాల్లో విషాదం

ప్రజాశక్తి - వేంపల్లె

పెండ్లిమర్రి మండలం కొత్తూరు వద్ద గురువారం చోటు చేసుకున్న ఘోర రోడ్డు ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులు మృతి చెందారు. పార్శిల్ కంటైనర్‌ను బైక ఓవర్‌టేక్ చేయబోయి వాహనం కిందపడిన సంఘటనలో వేంపల్లెకు చెందిన ముగ్గురు మృత్యువాత పడ్డారు.వారి కుటుంబాల్లో విషాదచాయలు అలుముకున్నాయి. వివరాలు.. వేంపల్లె శ్రీరామనగర్ గుట్టకు చెందిన బాలయ్య (50), రాజీవ్ నగర్ కాలనీకి చెందిన సిద్ద మల్లికార్జున (46), అన్నమయ్య జిల్లా మదనపల్లెకు చెందిన మట్టి మల్లికార్జున(30) అనే ముగ్గురు వ్యక్తులు మోటార్ బైకులో పని నిమిత్తం పెండ్లిమర్రి మండలం నందిమండలానికి బయలుదేరారు. పెండ్లిమర్రి వద్ద వారి ముందు పార్శిల్ కంటైనర్ కడప వైపునకు వెళ్లింది. మండలంలోని కొత్తూరు గ్రామం వద్దకు రాగానే కంటైనర్‌ను ఓవర్‌టేక్ చేయబోయారు. ఆ సమయంలో బైక్ అదుపు తప్పి ముందు వెళ్తున్న కంటైనర్ వెనుక టైర్ల కింద పడ్డారు. సిద్ద మల్లికార్జున అనే వ్యక్తి తలపై టైర్లు వెళ్లడంతో అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. మరో ఇద్దరు బాలయ్య, మదనపల్లెకు చెందిన మల్లికార్జునకు బలమైన గాయాలు కావడంతో స్థానికులు 108 వాహనం ద్వారా వేంపల్లె ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి వారు మృతిచెందారు. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని రోడ్డు ప్రమాదంపై ఆరా తీశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మృతుల్లో మదనపల్లెకు చెందిన మట్టి మల్లికార్జున వేంపల్లెలోని బాలయ్య ఇంటికి గురువారం వచ్చాడు. వీరిద్దరూ బంధువులు. కాగా వేంపల్లె రాజీవ్‌నగర్‌కు చెందిన సిద్ద మల్లికార్జున వీరిద్దరికీ స్నేహితుడు కావడంతో ముగ్గురు కలిసి మోటార్‌బైక్‌లో తమ సొంత పనినిమిత్తం పెండ్లిమర్రిమండలం నందిమండలానికి బయలుదేరారు. ఇంతలో ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుని దుర్మరణం చెందారు. సిద్దమల్లికార్జున కూలి పని చేసుకుని జీవించేవాడు. ఇతనికి భార్యతోపాటు ముగ్గురు పిల్లలున్నారు. బాలయ్య, మట్టి మల్లికార్జున ఇద్దరూ మగ్గం పని చేసుకుని జీవిస్తున్నారు.

ప్రమాదంలో మృతిచెందిన బాలయ్య, మట్టి మల్లికార్జున

మృతుల కుటుంబాల్లో విషాదం

పెండ్లిమర్రి మండలంలో చోటు చేసుకున్న ఘోర రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన మట్టి మల్లికార్జున, బాలయ్య, సిద్ద మల్లికార్జున దుర్మరణం చెందడంతో వారి కుటుంబాల్లో విషాద ఛాయలు అలుముకున్నాయి. ప్రభుత్వం మృతుల కుటుంబాలను ఆదుకోవాలని పలువురు కోరుతున్నారు.

విపత్కర పరిస్థితులను ఎదుర్కొంటాం : కలెక్టర్

రైల్వేస్టేషన్‌లో మాక్‌డ్రిల్

ప్రజాశక్తి - కడప

అనుకోని ఘటనలు ఏమైనా జరిగినట్లయితే వాటిని సమర్థంగా ఎదుర్కొనేందుకు అధికార యంత్రాంగం అన్ని వేళలా సన్నద్ధంగా ఉంటుందని కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా అత్యంత జన సంచారం ఉండే కడప రైల్వేస్టేషన్ ప్రాంగణంలో గురువారం కలెక్టర్ ఆధ్వర్యంలో జిల్లా అధికార యంత్రాంగం సివిల్ మాక్ డ్రిల్ నిర్వహించింది. ఈ సందర్భంగా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి మాట్లాడుతూ ఆకస్మాత్తుగా ఏదైనా ప్రమాద సంఘటన జరిగితే ప్రజలు ఎలా స్పందించాలో ముందు నుంచే అప్రమత్తం చేస్తున్నామని పేర్కొన్నారు. అనుకోని రీతిలో ఉగ్రదాడులు జరిగినా, బాంబులు పేలినా, అగ్ని ప్రమాదాలు వాటిల్లినా ఎలా వ్యవహరించాలి అనే అంశాలపై ప్రజలను అప్రమత్తం చేస్తూ రక్షణ దళాలు ప్రదర్శనలు చేయడం చాలా ఉత్తమం భరోసానిస్తుందని అన్నారు. సివిల్ డిఫెన్స్ మాక్ డ్రిల్ లో భాగంగా జిల్లాలోని పలు ఉత్పాదక కేంద్రాలైన ఎన్‌టిపిసి, హెచ్ పిసిఎల్, ఐఒసిఎల్, యూనిటీల్ లతో పాటు రైల్వేస్టేషన్స్, విమానాశ్రయం, బస్ స్టాండ్‌లలో మాక్ డ్రిల్ ద్వారా విపత్కర పరిస్థితుల్లో ప్రజలకు రక్షణ, తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై మాక్ డ్రిల్స్ నిర్వహించేందుకు చర్యలు తీసుకున్నామని చెప్పారు. నిజమైన ఘటనల్లో ఏ విధంగా అధికారిక బృందాలు, వైద్య బృందాలు వ్యవహరిస్తాయో తెలుపుతూ ప్రదర్శనలు ఇస్తున్నామని చెప్పారు. అగ్నిమాపక వాహనాలను, అంబులెన్స్‌లను, ఎమెర్జెన్సీ రెస్పాన్స్ టీములు, ఎమెర్జెన్సీ సిబ్బంది, తాత్కాలిక వైద్య శిబిరాలు ఏర్పాటు చేశామని, రక్షణ చర్యల్లో వినియోగించే అన్ని రకాల పరికరాలను ప్రదర్శనలో ఉంచామని కలెక్టర్ వివరించారు. రైల్వే స్టేషన్ భవనాలపై ఉగ్ర మూకల బాంబులతో దాడులు చేసే అక్కడ ఎదురయ్యే పరిస్థితులకు స్పందించిన అగ్నిమాపక శాఖ సిబ్బంది మంటలను అదుపు చేయడం, వెనువెంటనే సంఘటనా స్థలానికి మాస్కులు ధరించి చేరుకున్న ఎస్‌డిఆర్ఎఫ్ సహాయక సిబ్బంది ప్రమాదంలో చిక్కుకున్న ప్రజలను కాపాడడం, నిచ్చెన, రోప్ సాయంతో కొందరిని, మెట్ల మార్గం ద్వారా మరికొందరిని కాపాడడం, అగ్ని ప్రమాదం సంభవించే సమయంలో హుటాహుటి ప్రమాద స్థలానికి సమీపంలో ఏర్పాటు చేసిన తాత్కాలిక వైద్య శిబిరాలకు తరలించి ప్రథమ చికిత్స అందించడం తీరు.. ప్రజల్లో మంచి అవగాహనను పెంపొందించిందన్నారు. ఇలాంటి మాక్ డ్రిల్ ద్వారా విపత్కర పరిస్థితుల్లో సంభవించే పరిస్థితులను ఎలా ఎదుర్కోవాలి అనే విషయాలపై ప్రజలకు చక్కటి సందేశాన్ని ఇచ్చామని చెప్పారు. అలారం మోగినప్పుడు ఏ విధంగా స్పందించాలో, సేఫ్ జోన్‌కు ఎలా చేరుకోవాలో తెలిపామని. రోప్ ల సాయంతో భవనాలపై నుంచి కిందకు ఎలా దిగాలో చేసి చూపించామని. సందేశాత్మక రూపకంలా సాగిన ఈ మాక్ డ్రిల్ లో పాల్గొన్న వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, స్థానిక పౌరులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులకు జిల్లా కలెక్టర్ ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో ఎస్‌పి అశోక్ కుమార్, జెసి అదితిసింగ్, కడప ఆర్‌డిఒ జాన్ ఇర్విన్, కెంఎసి కమిషనర్ మనోజ్ రెడ్డి, జిల్లా ఫైర్ అధికారి ధర్మారావు ధర్మరావు దగ్గరుండి పర్యవేక్షించారు. పలువురు పోలీసు, ఆర్‌పిఎఫ్ మెడికల్, జిల్లా అధికారులు, రెవెన్యూ కెఎంసి, ఆ సిబ్బంది ప్రజలు పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్

రోప్ ద్వారా ప్రయాణికుడిని కాపాడే విధానంపై అవగాన కల్పిస్తున్న రక్షణ సిబ్బంది

విద్యావేత్తలుగా ఎదగాలి

- గౌతమి ఇంజినీరింగ్ కళాశాల కరస్పాండెంట్ నాగూర్

ప్రజాశక్తి - కడప సిటీ

దూదేకుల విద్యార్థులు విద్య, వైద్య, వైజ్ఞానిక రంగాల్లో రాణించాలని ప్రొద్దుటూరుకు చెందిన గౌతమి ఇంజినీరింగ్ కళాశాల కరస్పాండెంట్ సి. నాగూర్, రిటైర్డు ఫారెస్ట్ కన్జర్వేటర్ పి.బాదేష ఉద్ఘోదించారు. గురువారం కడప నగరంలోని ఎర్రముక్కపల్లి దూదేకుల భవనంలో దూదేకుల సంఘం జిల్లా అధ్యక్షులు వి.ఖాదరయ్య, జిల్లా గౌరవాధ్యక్షులు ఆయిల్ మిల్లు ఒబులేసు, ప్రధాన కార్యదర్శి రిటైర్డ్ ప్రిన్సిపల్ ఫ్లమ్మర్, ఎస్.మస్తాన్, నజీర్, ఉజ్జుల్లా అధ్యక్షతన నిర్వహించిన అబ్దుల్‌కలామ్ మెరిట్ పురస్కారాల ప్రదాన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సి.నాగూర్, బాద్‌షా హాజరయ్యారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఉమ్మడి కడప జిల్లాకు చెందిన ఇంటర్, టెన్త్ ఫలితాల్లో రాణించిన 58 మంది విద్యార్థులు మరి ఉత బాధ్యతగా చదవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. టెన్త్, ఇంటర్ ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని ప్రణాళికాబద్ధంగా చదవాలని చెప్పారు. దూదేకుల సామాజికంగా, ఆర్థికంగా వెనుక బడి ఉన్న సంగతిని గమనంలో ఉంచుకుని చదువు ద్వారా రాణించాలని పేర్కొన్నారు. తల్లిదండ్రులు సైతం తమ పిల్లల చదువు పట్ల ఆసక్తిని కలిగించే ప్రయత్నం చేయాలని సూచించారు. భౌతిక ప్రపంచంలో జ్ఞానం ద్వారా ఏదైనా సాధించవచ్చనే సంగతిని గ్రహించాలన్నారు. ప్రొద్దుటూరు వట్ల ఇంజినీరింగ్ కళాశాల పిల్లలకు ఇంజినీరింగ్, పాలిటెక్నిక్ విద్యను ఉచితంగా అందించే ప్రయత్నం చేస్తామన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు మహబూబ్ బా షా, ఆర్.బాబు, ఫారెస్ట్ రిటైర్డు ఆఫీసర్ హసేన్, పగడాల దస్తగిరి, పగడాల పెద్దన్న, పలువురు విద్యార్థులు, తల్లిదండ్రులు పెద్దఎత్తున హాజరయ్యారు.

విద్యార్థులకు పురస్కారాలు అందజేస్తున్న కరస్పాండెంట్

ఎస్‌పిని కలిసిన ఖాసింఖాన్

ప్రజాశక్తి - కడప అర్బన్

సీనియర్ ఆడిటర్, ప్రముఖ విద్యావేత్త, చాంబర్ మెమోరియల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు లయ న్ డాక్టర్ ఖాసింఖాన్ ఎస్‌పి అశోక్‌కుమా ర్‌ను మర్యాద పూర్వ కంగా కలిశారు. శాలువా, బొకేతో సన్మానించారు. ఈ సందర్భంగా ఖాసింఖాన్ మాట్లాడుతూ 2010 వరకు జిల్లా ప్రాతినిధ్యం వహించిన కలెక్టర్ జయేష్ రంజన్, అశోక్ కుమార్, అనిల్ కుమార్, ఎస్‌పి సజ్జనార్, నాగిరెడ్డి, చౌహన్ తో కలిసి అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టానని పేర్కొన్నారు. పోలీస్, రెవెన్యూ శాఖలకు చేస్తున్న సేవా కార్యక్రమాలు చేసినట్లు గుర్తు చేశారు. ఎస్‌పి మాట్లాడుతూ 2009లో హిందూపూర్ ఎంపీగా పోటీ చేసిన ఖాసిం ఖాన్ సేవా కార్యక్రమాలు చేస్తూ ఉన్నారని తెలిపారు. భవిష్యత్తులో పోలీసు శాఖకు సహకరించాలని కోరారు. స్పందించిన ఖాసింఖాన్ తన వంతు ఆర్థిక సాయం చేస్తానని ఈ సంద ర్భంగా పేర్కొన్నారు. కార్యక్రమంలో మన్సూర్ అలీ ఖాన్ పాల్గొన్నారు.

ఎస్‌పిని సన్మానిస్తున్న ఖాసింఖాన్

గాలివాన బీభత్సం

-నేలరాలిన మామిడికాయలు - ఆందోళనలో రైతులు
- ప్రభుత్వమే ఆదుకోవాలంటూ వేడుకోలు

ప్రజాశక్తి - చక్రాయపేట

చక్రాయపేట మండలంలో ఎర్ర గుడి, కల్లూరుపల్లె గ్రామాల్లో గురువారం గాలివాన బీభత్సం సృష్టించింది. ఈ సంఘటనలో మామిడి రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. ఎర్రగుడి గ్రామంలోని జగదీశ్వర్ రెడ్డి 300 మామిడి చెట్లు, హర్షవర్ధన్ రెడ్డి 400 మామిడి చెట్లు, ప్రభాకర్ రెడ్డి 1500 మామిడి చెట్లు, దేవేంద్ర కుమార్ 700 మామిడి చెట్లు వేగంగా వీచిన గాలులకు కుప్పకూలాయి. మామిడి కాయలన్నీ నేలరాలడంతో బాధిత రైతులు లబోదిబోమంటున్నారు. కడుపున పుట్టిన బిడ్డ మాదిరిగా మామిడి చెట్లను పెంచుకున్నామని, తీరా పంట దిగుబడి వచ్చి కోతకు వచ్చే సమయంలో ఈదురు గాలులతో చెట్లకు ఉన్న మామిడికాయలు పూర్తిగా రాలిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. సుమారు లక్షలాది రూపాయలు నష్టం వాటిల్లిందని వాపోయారు. లక్షలు అప్పుడు చేసి చెట్లను, కాయలను కాపాడుకుంటూ వచ్చామని, కోతకు వచ్చే సమయంలో గాలివాన బీభత్సానికి చెట్లకు ఉన్న కాయలన్నీ నేలకు ఒరిగిపోయాయని ఆందోళ చెందారు. నష్టపోయిన రైతులకు ప్రభుత్వం ఆర్థిక సహాయం అందజేసి ఆదుకోవాలని పలువురు కోరుతున్నారు.

ఈదురు గాలులకు నేలరాలిన మామిడి కాయలు

20న వరల్డ్ మెట్రాలజీ డే

ప్రజాశక్తి-కడప అర్బన్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సివిల్ సప్లయ్ శాఖ కమిషనర్ సౌరబ్ గౌర్ ఆదేశాల మేరకు వరల్డ్ మెట్రాలజీ డే సందర్భంగా ఈనెల 20 నుంచి వారం రోజులు పాటు లీగల్ మెట్రాలజీ వారోత్సవాలు నిర్వహించాలని ఆదేశాలు జారీ చేశారు. అందులో భాగంగా గురువారం రైతు బజార్ వ్యాపారస్తులకు, ప్రజలకు లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ రమేష్ కుమార్ రెడ్డి అవగాహన సదస్సు నిర్వహించారు. ఇందులో వినియోగదారులు పాల్గొని వారు కొన్న కూరగాయలు, పండ్లు, పూలు పరిమాణాలు సరిగా ఉన్నాయో లేదో కొలత వేసి చూసుకున్నారు. వినియోగదారులు మోసపోకుండా ఎలా ఉండాలో అవగాహన కల్పించారు. ప్రజలు తమ సందేహాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో లీగల్ మెట్రాలజీ సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రమేష్‌కుమార్‌రెడ్డి

క్రమశిక్షణకు మారుపేరు ఎన్‌సిసి డ్రిల్

ప్రజాశక్తి - కడప: క్రమశిక్షణకు, చక్కటి శరీర సౌష్టవానికి ఎన్‌సిసి డ్రిల్ ఉపయోగపడుతుందని 30వ ఆంధ్ర బెటాలియన్ కమాండింగ్ అధికారి కల్నల్ సూర్యనారాయణ మూర్తి అన్నారు. బిల్డింగ్ గుంగ్రం కాలనీలో నిర్వహిస్తున్న ఎన్‌సిసి ఉమ్మడి వార్షిక శిక్షణ శిబిరంలో భాగంగా గురువారం ఎన్‌సిసి కేడెట్లకు రైఫిల్ డ్రిల్ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో ఉత్తమ పౌరులుగా మెలగడానికి అవసరమైన అన్ని రకాల శిక్షణను ఉపయోగించుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ క్యాంప్ కమాండెంట్ గ్రూప్ కెప్టెన్ ఆర్.జె. ఆత్రే, అధికారులు పాల్గొన్నారు.

డిడిని సస్పెండ్ చేయాలి

- సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్

ప్రజాశక్తి - కడప అర్బన్ : నగరంలోని ప్రభుత్వాసుపత్రిలో పనిచేస్తున్న ఆప్కాస్ కార్మికులను ఒక రకంగా, నచ్చిన వారి పట్ల మరో రకంగా వ్యవహరిస్తున్న డిడి శ్రీనివాస్ రావును సస్పెండ్ చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్, నగర ప్రధాన కార్యదర్శి వెంకటసుబ్బయ్య, అధ్యక్షులు చంద్రారెడ్డి కోరారు. గురువారం డిప్యూటీ కలెక్టర్ రంగాస్వామికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డిడి శ్రీనివాసులు అదుపు లేకుండా అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్నారని తెలిపారు. ఇందుకు నిదర్శనం ఐటీఐల ఒక ఉద్యోగి అనారోగ్యకారణాలతో విధులకు రాకపోయిన రెండు నెలల జీతం చేసిన వర్కర్ డిడి ఆని తెలిపారు. కార్డియాక్ డ్యూటీకి వచ్చిన వారిని అనేక కారణాలు మోపి ఇబ్బందులు గురి చేస్తున్నారని చెప్పారు. ఇంత జరుగుతున్నా జిల్లా వైద్యాధికారులు పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. ఇలాంటి అవినీతి డిడి శ్రీనివాస్ రావుపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకపోతే జిల్లా వ్యాప్తంగా ఆందోళన చేస్తామని హెచ్చరించారు. లెటర్స్ ఇచ్చే కొద్ది ఆయనలో మార్పు లేదని తెలిపారు.

యుద్ధ సమయంలో చికిత్స అందించాలి

ప్రజాశక్తి - కడప అర్బన్ : యుద్ధ సమయంలో ప్రయివేట్ ఆసుపత్రిలో ప్రజలకు ఎలాంటి చికిత్స అందించాలో ప్రయివేట్ ఆస్పత్రి యాజమాన్యానికి జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ నాగరాజు అవగాహన కల్పించారు. గురువారం జూమ్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రయివేట్ ఆస్పత్రిలో సివిల్ డిఫెన్స్ సిద్ధత పై అవగాహన కల్పించినట్లు పేర్కొన్నారు. ప్రయివేట్ ఆసుపత్రులలో అవసరమైన మందులు, వైద్య సామగ్రి స్టాక్ పెట్టాలని, అత్యవసర, ట్రామా కేర్ కోసం ప్రత్యేక వార్డు, స్పెషలిస్ట్ డాక్టర్లు, సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.

డిఎస్‌సి అభ్యర్థులకు న్యాయం చేయాలి : డివైఎఫ్ఐ

ప్రజాశక్తి - బద్వేలు : డిఎస్‌సి అభ్యర్థులకు పరీక్షకు 90 రోజులు గడువు ఇవ్వాలని, జిల్లాకు ఒకే పేపర్ విధానం పెట్టాలని, వయోపరిమితి 47 సంవత్సరాలు పెంచాలని, డివైఎఫ్ఐ కడప జిల్లా అధ్యక్షులు ముడియం చిన్ని డిమాండ్ చేశారు. గురువారం బద్వేల్ పట్టణంలోని డివైఎఫ్ఐ పట్టణ కార్యదర్శి ఎస్కే ఆదిల్ పట్టణ నాయకులు మనోజ్ కుమార్, నరసింహులతో కలిసి ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో నిరుద్యోగులు పోరాట ఫలితంగా డిఎస్‌సి నోటిఫికేషన్ సాధించుకోవడం జరిగిందని పేర్కొన్నారు. ఏడు సంవత్సరాల తర్వాత వెలువడిన నోటిఫికేషన్‌లో నిరుద్యోగులు సన్నద్ధం అవ్వడానికి పరీక్షకు కనీసం 90 రోజులను సమయం లేకపోవడంతో తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. వయోపరిమితి 44 సంవత్సరాలు కేటాయించడంతో ఇప్పటికే డిఎస్‌సి నోటిఫికేషన్ కోసం ఎదురుచూస్తూ వయోభారంతో ఉన్న నిరుద్యోగులు అనర్హులు కావడం వలన చాలా ఇబ్బంది కలిగినట్టువంటి విషయమన్నారు. ఓపెన్ డిగ్రీలో పాస్ అయిన వారికి కూడా అవకాశం కల్పించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం టెక్నికల్ సమస్యలను త్వరగా పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

191 ఎకరాల్లో అదానీ గ్రీన్ఎనర్జీ

- 46 ఏళ్లపాటు లీజుకు ఆమోదం
- కేబినెట్ సమావేశంలో మంత్రి మండలి నిర్ణయం

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిల్లాలోని కొండాపురం మండలం కె.బొమ్మేపల్లి సమీపంలో అదానీ ఎనర్జీ లిమిటెడ్ నిర్మించనున్న పంప్డ్ స్టోరేజ్ హైడ్రో ప్రాజెక్టుకు 191 ఎకరాలను కేటాయిస్తూ రాష్ట్ర మంత్రిమండలి నిర్ణయం చింది. ఈ మేరకు గురువారం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధ్యక్షతన నిర్వహించిన కేబినెట్ సమావేశంలో తీర్మానించారు. కొండాపురం మండలం బొమ్మేపల్లి గ్రామ సర్వేనెంబర్ 307 లోని 150 ఎకరాలు, 308 సర్వే నెంబర్‌లోని 41.64 ఎక రాల్లో అదానీ గ్రీన్‌ఎనర్జీ లిమిటెడ్ 1000 మెగావాట్ల పంప్డ్ స్టోరేజ్ హైడ్రో స్టోరేజ్ ప్రాజెక్టు ఏర్పాటు చేయనున్న సంగతి తెలిసిందే. ఇందుకు గాను నెడ్‌క్యాప్ డిపార్ట్‌మెంట్ ద్వారా ఎకరానికి ఏడాదికి రూ.31 వేల చొప్పున ప్రతి రెండేళ్లకు ఒకసారి ఐదు శాతం పెరుగుదల ప్రా తిపదికన లీజు చెల్లించనున్నారు. ఈమేరకు ఆర్‌ఈల్ పంప్డ్ హైడ్రో స్టోరేజ్ ప్రాజెక్టును పూర్తి చేయనున్నట్లు పేర్కొంది. ఈలెక్కన 40 ఏళ్ల ఆరేళ్లు కలిపి లెక్కిస్తే 46 ఏళ్లపాటు లీజు చెల్లించడానికి ఆమోదం తెలపడం గమనార్హం.

పహల్గాం ముష్కరులను భారత్‌కు అప్పగించాలి

ప్రజాశక్తి - కడప అర్బన్

పహల్గాం ముష్కరులను పాకిస్తాన్ భారత ప్రభుత్వానికి అప్పగించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి జి చంద్రశేఖర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పాకిస్తాన్ ఉగ్రవాద శిక్షణ శిబిరాలను లక్ష్యంగా చేసుకుని భారత త్రివిధ దళాల సైన్యం సమన్వయంతో సమర్థవంతంగా నిర్దిష్ట లక్ష్యాలపైనే దాడులు చేయడం భారత సైనికుల యుద్ధ నీతిని, వ్యూహాన్ని, నైపుణ్యాన్ని ప్రతిభను ప్రదర్శించిందని పేర్కొన్నారు. ప్రపంచ దేశాల ప్రశంసలు అందుకునే విధంగా 'భారత మిలిటరీ ఆపరేషన్' ఉందని తెలిపారు. దేశ సమగ్రతను, ప్రజల సమైక్యతను పరిరక్షించే విధంగా ప్రజలు భారత ప్రభుత్వ చర్యలకు మద్దతుగా ఉంటాయని, కొనసాగాలని పేర్కొన్నారు. ఐక్యరాజ్యసమితి భద్రతామండలి త్రివిధ దళాలు పిఒకెలో ఉన్న ఉగ్రవాద శిబిరాలు అన్నింటిని ధ్వంసం చేయాలని ప్రపంచ మానవాళి కోరుకుంటుందని తెలిపారు. ప్రపంచంలోని ఏ మతమైనా శాంతిని, మానవమనుగడను, పురోగమనాన్ని కోరుకుంటాయని పేర్కొన్నారు.

ఆంగ్ల పదజాల ఆటలతో వేసవి వినోదం

ప్రజాశక్తి - కడప అర్బన్

నగరంలోని కొండయ్య పల్లి జిల్లా కేంద్ర గ్రంథాలయంలో గ్రంథాలయ జిల్లా కార్యదర్శి అమీరుద్దీన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవివినోద కార్యక్రమంలో భాగంగా గురువారం విద్యార్థులతో ఆంగ్ల పదజాలంతో ఆటలాడించారు. క్విజ్ నిర్వాహించి బహుమతులను అందజేశారు. రిసోర్స్ పర్సన్‌గా వచ్చిన ఉపాధ్యాయులు వీణ పల్లవి ఆంగ్ల భాషను నేర్చుకోవటంలో మెళకువలు నేర్పారు. సెంటెన్స్ టెస్ట్ ద్వారా 200 పదాలు చదివడం, రాయడం చెప్పారు. క్విజ్ నిర్వహించి స్వయంగా బహుమతులను ప్రదానం చేశారు. పిల్లలు చాలా ఉత్సాహంగా, ఉల్లాసంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ లైబ్రేరియన్ పవన్ కుమార్, సిబ్బంది రమణ, సుబ్బమ్మ పాల్గొన్నారు.

అన్నదానం చేస్తున్న రిటైర్డ్ ఎస్ఐ రామకృష్ణ

అనాథ వృద్ధుల కోసమే వసతిగృహం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

పట్టణంలోని ఈశ్వరరెడ్డి నగర్‌లో ఉన్న అమ్మానాన్న మదర్ థెరిస్సా షబ్బీర్ అనాథ వృద్ధాశ్రమంలో దాత రిటైర్డ్ ఎస్ఐ రామకృష్ణ, శ్రీదేవి ఆధ్వర్యంలో నూతన వసతిగృహాన్ని నిర్మించారు. వసతిగృహంలో యుఎస్ఎకు చెందిన సిద్ధారాంపురం రామ్‌కిషోర్, శైలజ ఫ్లోరింగ్ పనులు చేయించారు. నూతన వసతిగృహన్ని రిటైర్డ్ ఎస్ఐ రామకృష్ణ ప్రారభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనాథ వృద్ధుల కోసం వసతిగృహాన్ని నిర్మించడం చాలా సంతోషంగా ఉందన్నారు. జీవితంలో పిల్లల ప్రేమాభిమానాలులేని అనాథలకు సేవా చేయాలనే తపనతో తనకు తోచిన సాయం చేస్తున్నానని తెలిపారు. అనాథ వృద్ధులకు, విభిన్నప్రతిభావంతులకు సేవా చేయడం గొప్ప భాగ్య మన్నారు. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఎస్ఐ రామకృష్ణ కుటుంబ సభ్యులు, ఆశ్రమ నిర్వాహకులు పాల్గొన్నారు.

విద్యారంగ సంక్షేమానికి పునరంకితమవుదాం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

ప్రభుత్వ విద్యారంగ ఉన్నతికి, సంక్షేమానికి కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో పునరంకితం అవుదామని జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆది నారాయణరెడ్డి పేర్కొన్నారు. ఎస్‌టియు జమ్మలమడుగు రీజియన్ ఆధ్వర్యంలో స్థానిక పిఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. మైలవరం, పెద్దముడియం, జమ్మలమడుగు మండలాల అన్ని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి పరీక్షలో ప్రతిభ కనబరచిన మొదటి, రెండవ స్థానాల్లో నిలిచిన విద్యార్థులను, ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించి అభినందించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ చదువు పట్ల ఇష్టం పెంచుకుంటే కష్టం తెలియకుండా ఉన్నతస్థాయికి చేరవచ్చని సూచించారు. ఏపీఈఆర్టీ రాష్ట్ర డైరెక్టర్ వెంకటక్రిష్ణారెడ్డి మాట్లాడుతూ డిఎస్సి ద్వారా వేలాది ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయబోతున్నట్లు తెలిపారు. ఈ వేసవిలో పదోన్నతులు, బదిలీలు నిర్వహించి జూన్ 12 నాటికి నిర్దేశించిన అకడమిక్ కేలండర్‌ను పూర్తి స్థాయిలో అమలు చేయబోతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ మాజీ ఎమ్మెల్సీ కత్తి నర్సింహారెడ్డి, టిడిపి జమ్మలమడుగు ఇన్‌ఛార్జి భూపేష్‌రెడ్డి, ఎస్టీయూ నాయకులు గురుకుమార్, ఇలియాస్ బాషా, సంగమేశ్వర రెడ్డి, ప్రతాప్‌రెడ్డి కుండా భాస్కర్, శివరామిరెడ్డి, ఉపేంద్ర శివరాం, వెంకటేశ్వర్లు, ప్రసాద్ బాబు, రాజశేఖర్, రమేష్, శ్రీనివాస్ రెడ్డి, మల్లికార్జున, ఎంఇఒలు రమణారెడ్డి, చంద్రశేఖరరావు, చౌడయ్య, చిట్టిబాబు పాల్గొన్నారు.

భూపేష్‌కు వినతిపత్రమిస్తున్న డివైఎఫ్ఐ నాయకులు

గురుకుల పాఠశాల ప్రిన్సిపల్‌పై చర్యలు తీసుకోవాలి : డివైఎఫ్ఐ

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

కొండాపురం మండలం చౌటిపల్లిలోని అంబేద్కర్ గురుకుల పాఠశాల ప్రిన్సిపల్‌పై చర్యలు తీసుకోవాలని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరణాల శివకుమార్ కోరారు. స్థానిక టిడిపి ఇన్‌ఛార్జి భూపేష్‌రెడ్డికి గురువారం పార్టీ కార్యాలయంలో గ్రీవెన్స్‌లో వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ కొండాపురం అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాలలో పురుషులు ఎవరూ నివాసం ఉండకూడదనే నిబంధన ఉన్నా, ప్రిన్సిపల్ తన భర్తను అక్కడే ఉండనిస్తోందన్నారు. లైంగిక ఆరోపణలు కలిగిన వ్యక్తిని బాలికల పాఠశాలలో ఎలా ఉంటారని ప్రజలు ప్రశ్నిస్తున్నారని పేర్కొన్నారు. వీరిపై డిసిఒకు విన్నవించినా దాటవేసే ధోరణి చేస్తూ ఆరోపణలు, కేసులు కలిగిన వ్యక్తులకు వత్తాసు పలుకుతున్నారని తెలిపారు. ఇందుకు భూపేష్ స్పందిస్తూ సంభందిత అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ జమ్మలమడుగు పట్టణ అధ్యక్షులు ఎల్లయ్య, పట్టణ నాయకులు మహేష్, నాగరాజు, సురేంద్ర పాల్గొన్నారు.

రేషన్ కార్డుల కోసం దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి - ఖాజీపేట

అర్హతగల కుటుంబాలకు, దారిద్రరేఖకు దిగువ ఉన్న వారికి రేషన్ కార్డు కొత్తగా మంజూరు చేయడానికి, మార్పులు చేర్పులకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. చిరునామా మార్పు, తప్పుల సవరణ వంటి సమస్యల పరిష్కరించుకోవచ్చు. అర్హతగల వారు సమీప గ్రామ సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని రెవెన్యూ అధికారులు సూచించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

త్వరలో అన్నదాత సుఖీభవ

ప్రజాశక్తి - చక్రాయపేట

త్వరలో అన్నదాత సుఖీభవ అందనుందని గురువారం ఎఒ నవ్వంతబాబు ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రప్రభుత్వం రూ.14,000, కేంద్రప్రభుత్వం ఇచ్చే రూ.6,000 కలిపి ఏడాదికి రూ.20,000 రైతులకు అందనుందని తెలిపారు. ఆర్‌ఎస్‌కె జాబితాలను పరిశీలించమని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేశారు. ఆ ప్రకారం గ్రామస్థాయిలో ఆర్‌ఎస్‌కె సిబ్బంది జాబితాలో వివరాలను సరిచూస్తున్నారు. గ్రామస్థాయిలో ఆర్‌ఎస్‌కె సిబ్బంది, మండల పరిధిలోని తహశీల్దార్ ఎంఎఒ అప్రూవల్ అయిన తర్వాత రాష్ట్ర ప్రభుత్వం అన్నదాత సుఖీభవ కింద రూ.20,000 రైతులకు అందజేస్తారన్నారు.

ప్రాణం తీసిన ఈత సరదా

- బిటెక్ విద్యార్థి మృతి

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

స్నేహితులతో కలిసి సరదాగా ఈతకు వెళ్లి బీటెక్ విద్యార్థి మృతి చెందిన సంఘటన పట్టణంలో చోటు చేసుకుంది. గురువారం పెద్దరంగాపురం గ్రామానికి చెందిన నాదెండ్ల చిన్న ఇమాములు, మస్తానమ్మ దంపతులకు ఒకేఒక్క సంతానం నాదెండ్ల అన్వర్ (20) రాయలపురం సమీపంలోని బ్రిడ్జి వద్ద ఈత కొడుతూ ప్రమాదవశాత్తు నీట మునిగి మృతి చెందాడు. అన్వర్ పుత్తూరు ఇంజినీరింగ్ కాలేజీలో సెకండ్ ఇయర్ చదువుతున్నాడు. స్థానికులు మృతదేహాన్ని బయ టికి తీశారు. పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఉన్న ఒక్క కొడుకు మరణించడంతో కుటుంబంలో విషాదఛాయలు అలముకున్నాయి.



అన్వర్ (ఫైల్‌ఫోటో)

నీటి తొట్ల నిర్మాణం.. తీరనున్న పశువుల దాహం

ప్రజాశక్తి - ఖాజీపేట

ప్రభుత్వం పశు సంరక్షణపై ప్రత్యేకదృష్టి సారించింది. మూగజీవాల దాహం తీర్చేందుకు నీటి తొట్టెల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. ఎండల తీవ్రత దృష్ట్యా మూగజీవాలు దాహార్తికి ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో పశుసంవర్ధక శాఖ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా నీటి తొట్టెల నిర్మాణం ప్రారంభించింది. ఈ నీటి తొట్టెల నిర్మాణం వల్ల గొర్రెలు, మేకలు, పశువులు తదితర జీవాల దాహం తీర నుంది. ఒక్కో తొట్టి నిర్మాణానికి ప్రభుత్వం రూ.30 వేలు మంజూరు చేస్తుంది. గత ప్రభుత్వ హయాంలో పశు సంరక్షణ అభివృద్ధికి ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ప్రస్తుత ప్రభుత్వం పాడి పరిశ్రమ అభివృద్ధి కోసం నీటి తొట్టెల నిర్మాణం, పశుబీమా, పశువుల ఆహార కొరత తీర్చడం కోసం పశు గ్రాస క్షేత్రాల ఏర్పాటుకు వివిధ వర్గాలకు ఉచిత, రాయితీతో గడ్డి విత్తనాలను అందించేందుకు చర్యలు ఆరంభించింది. వ్యవసాయంలో పెట్టుబడి ఖర్చులు పెరగడంతో ఎక్కువమంది రైతులు ఇప్పుడిప్పుడే పాడి పరిశ్రమపై దృష్టి సారిస్తున్నారు. వేసవికాలంలో పాలకు డిమాండ్ ఏర్పడడంతో పాడి రైతులు ఎక్కువగా పశువులను కొనుగోలు చేసేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు. పశువుల కొనుగోలుకు ప్రభుత్వం రాయితీలు కల్పించేలా చర్యలు చేపడితే మరింత ప్రయోజనకరంగా ఉంటుందని పలువురు రైతులు సూచిస్తున్నారు.

బోసిరెడ్డి పల్లెలో నిర్మించిన పశువుల నీటి తొట్టి

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన నీటి తొట్టెల నిర్మాణ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని పశుసంవర్ధక శాఖ అధికారులు రైతులకు సూచిస్తున్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరుతున్నారు.

జీతాలు చెల్లించాలని కార్మికుల ధర్నా

ధర్నా చేస్తున్న పంచాయతీ కార్మికులు

ప్రజాశక్తి - వేంపల్లె

తమకు జీతాలు చెల్లించాలని పంచాయతీ సిబ్బంది డిమాండ్ చేశారు. ఆ మేరకు వారు గురువారం పంచాయతీ కార్యాలయం వద్ద ఆయా విభాగాల్లో పని చేస్తున్న వాటర్ స్కీం, పారిశుధ్యంతోపాటు సిబ్బంది ధర్నా చేశారు. గత 6 నెలలుగా జీతాలు రాలేదని ఇబ్బందిపడుతున్నామని వాపోయారు. పని మాత్రం చేయించుకుంటూ వేతనాలు ఇవ్వకపోవడంతో కుటుంబాల పరిస్థితి దారుణంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. పంచాయితీ ఇఒ బాధ్యతలు చేపట్టినా జీతాలు చెల్లించలేదని ఆందోళన వ్యక్తం చేశారు. జీతాలు విషయంపై స్పందించడం లేదని వాపోయారు. అప్పులు చేయాల్సిన పరిస్థితి నెలకొందని పేర్కొన్నారు. ఇప్పటికైనా అధికారులు కార్మికుల వేతనాలు మంజూరు చేసి ఆదుకోవాలని కోరారు. జీతాలు చెల్లించకపోతే విధులకు గైహజరు అవుతామని కార్మికులు హెచ్చరించారు.

గ్రామాలను శుభ్రంగా ఉంచాలి : డిఎల్‌పిఒ

ప్రజాశక్తి - ముద్దనూరు

గ్రామాలను శుభ్రంగా ఉంచాలని, ప్రతి రోజు ప్రతి ఇంటికెళ్లి తడిపొడి చెత్తను సేకరించాలని జమ్మలమడుగు డివిజన్ పంచాయతీ అధికారి తిమ్మక్క సూచించారు. ఇంటరాక్టివ్ వాయిస్ రెస్పాన్స్ సిస్టం (ఐవిఆర్‌ఎస్), ముద్దనూరు, ఉప్పులూరు గ్రామ పంచాయతీల్లో జరుగుతున్న పారిశుధ్య నిర్వహణ పనులను గురువారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పంచాయతీలు ప్రతి రోజు శుభ్రంగా ఉంచేలా చర్యలు తీసుకోవాలని ముద్దనూరు కార్యదర్శి లక్ష్మి నరసింహులు, ఉప్పులూరు పంచాయతీ కార్యదర్శి విజయభారతిని ఆదేశించారు. రోడ్లపై మురుగు నీరు, చెత్తచెదారం, వ్యర్థ పదార్థాలు వేయకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పరిసరాల శుభ్రతపై ప్రజలు, దుకాణదారులకు అవగాహన కల్పించాలని సూచించారు. రోడ్లపై చెత్త, వ్యర్థాలు వేసే దుకాణ యజమానులపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి రోజు ఇంటి వద్దకు వచ్చి తడిపొడి చెత్త సేకరిస్తున్నారా లేదా అని డిఎల్‌పిఒ ప్రజలతో ఆరా తీశారు. జాతీయ రహదారిపై పారిశుధ్యం శుభ్రం చేసే విధానంపై క్లాప్ మిత్రులకు అవగాహన కల్పించారు. సేకరించిన చెత్తను సంపద తయారీ కేంద్రానికి తరలించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడిఒ వీరభద్రుడు, ఉప్పులూరు సర్పంచ్ పల్లా గంగయ్య పాల్గొన్నారు.

చెత్త సేకరణను పరిశీలిస్తున్న డిఎల్‌పిఒ తిమ్మక్క

నిరాశపరిచిన ప్రధాని అమరావతి పర్యటన

తులసిరెడ్డిని సన్మానించిన నేతలు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

ఈనెల 2న ప్రధాని మోడీ అమరావతి పర్యటన రాష్ట్ర ప్రజలను తీవ్ర నిరాశకు గురి చేసిందని పిసిసి అధికార ప్రతినిధి డాక్టర్ ఎన్.తులసిరెడ్డి పేర్కొన్నారు. స్థానికంగా గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గతంలో 2015 అక్టోబర్ 22న మొదటిసారి శంకుస్థాపనకు వచ్చినప్పుడు కనీసం పార్లమెంటు మట్టి, యమునా నది నీటిని తెచ్చారని గుర్తు చేశారు. ఈసారి అది కూడా లేకుండా వట్టి చేతులతో వచ్చారని అన్నారు. పుల్లన్న పులివెందుల సంతకు రాను వచ్చాడు, పోనూ పోయాడు వట్టి చేతులతో అన్నట్లుందని పేర్కొన్నారు. విభజన చట్టంలో సెక్షన్ 94 ప్రకారం రాష్ట్ర రాజధానిలో సచివాలయం, రాజ్‌భవన్, అసెంబ్లీ, హైకోర్టు, సచివాలయం, మౌలిక సదుపాయాలు కేంద్రమే కల్పించాలి. పైసా విదల్చలేదన్నారు. రాష్ట్రానికి సంజీవిని వంటి ప్రత్యేకహోదా ప్రస్తావనే లేదన్నారు. సమావేశంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు పూల నజీర్, జిలానిబాషా, ఖాజాపీర్, అన్వర్ మహబూబ్ బాషా, భాస్కర్, మహమ్మద్, షంషీర్, అమర్నాథరెడ్డి, ఉత్తన్న, నాగరాజు, అశ్విన్ పాల్గొన్నారు.

ఆపరేషన్ సిందూర్ అభినందనీయం

ప్రజాశక్తి - వేంపల్లె

భారత రక్షణ దళాలు ఆపరేషన్ సిందూర్‌ను విజయవంతంగా నిర్వహించడం అద్భుతం, అభినందనీయమని పిసిసి అధికార ప్రతినిధి తులసి రెడ్డి పేర్కొన్నారు. గురువారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ పాకిస్థాన్‌లోని 4, పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లోని 5 ఉగ్రవాద శిబిరాల మీద దాడి చేయడం సాహసోపేతమన్నారు. పాక్ పౌరుల మీద గాని, పాకిస్థాన్ సైనిక స్థావరాల మీద గానీ దాడి చేయకుండా కేవలం ఉగ్రవాద శిబిరాల మీద మాత్రమే దాడి చేయడం మన రక్షణ దళాల సామర్థ్యానికి, ఖచ్చితత్వానికి నిదర్శనమన్నారు. మనదేశ సార్వభౌమత్వాన్ని కాపాడుకోవడం మన అందరి కర్తవ్యమని తెలిపారు. ఉగ్రవాదుల బారినుండి మన పౌరులను రక్షించుకోవడం మన బాధ్యత అన్నారు. ఈ కర్తవ్య నిర్వహణలో మన రక్షణ దళాలు నిర్వహించిన పాత్ర ప్రశంసనీయమని ఆయన కొనియాడారు. మన రక్షణ దళాలు తీసుకునే ఏ చర్యకైనా కాంగ్రెస్ పార్టీ పూర్తి మద్దతు ఇస్తుందని పేర్కొన్నారు. ఇలాంటి సమయంలో కశ్మీర్ నుండి కన్యాకుమారి వరకు పార్టీలకు, మతాలకు, కులాలకు, ప్రాంతాలకు అతీతంగా భారతీయులందరూ ఒక్క తాటిపై నిలవడం గర్వకారణమన్నారు. ఇప్పటికైనా పాకిస్థాన్ ప్రభుత్వం ఉగ్రవాదాన్ని ప్రోత్స హించడం మానుకొని, ఆ దేశ అభివృద్ధి, ఆ దేశ ప్రజల సుఖ శాంతులపై దృష్టి సారిస్తే మంచిదని సూచించారు.

చురుగ్గా మహానాడు పనులు

-టిడిపి పోలిట్ బ్యూరో సభ్యులు, జిల్లా అధ్యక్షులు శ్రీనివాసరెడ్డి

ప్రజాశక్తి- కడప అర్బన్

జిల్లాలో మొదటిసారి నిర్వహిస్తున్న మహానాడుకు చురుగ్గా పనులు కొనసాగుతూ ఉన్నాయని, వసతి సౌకర్యాల పరిశీలనకు గౌడ కార్పొరేషన్ చైర్మన్ గురుమూర్తి, కడపకు వచ్చారని టిడిపి పోలిట్ బ్యూరో సభ్యులు, జిల్లా అధ్యక్షులు శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. గురువారం ద్వారకా నగర్ లోని ఎమ్మెల్యే కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 27, 28, 29న మహానాడు కడపలో పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నామని చెప్పారు. 4,5 రోజులుగా వసతి, సౌకర్యాల కోసం స్థల సేకరణ పూర్తయిందని తెలిపారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అతిథులకు వసతి సౌకర్యం కల్పిస్తున్నామని పేర్కొన్నారు. దాదాపు 40 నుంచి 50 వేల మంది ప్రతినిధులు రెండు రోజుల సమావేశానికి హాజరవుతారని పేర్కొన్నారు. చివరి రోజు బహిరంగ సభ ఉంటుందని చెప్పారు. 12 జిల్లాలతో పాటు, తెలంగాణ నుంచి వచ్చే అతిథుల కోసం ఘనంగా ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. తమ వద్ద వసతి సౌకర్యం ఉంది అని ఎవరైనా భావిస్తే 9063596644 కు ఫోన్ చేయాలని కోరారు. గౌడ కార్పొరేషన్ చైర్మన్ గురుమూర్తి మాట్లాడుతూ మొదటిసారి జిల్లాలో మహానాడు పండుగ నిర్వహిస్తున్నారని చెప్పారు. ఎన్టీఆర్ జయంతి సందర్భంగా నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరయ్యే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఈనెల 14న జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి మరోమారు మహానాడు ఏర్పాట్ల పై మాట్లాడతారని తెలిపారు.

చదువుతోనే బంగారు భవిష్యత్తు

ప్రజాశక్తి - కడప

చదువుతోనే బంగారు భవిష్యత్ అని, పిల్లలు, పెద్దలు విద్యతో పాటు ఆధ్యాత్మికంగా ఎదగాలని తాలూకా సిఐ టి.రెడ్డప్ప పేర్కొన్నారు. కడప నగరం 48 డివిజన్ కృపా కాలానికి చెందిన న్యూ నేటివ్ కృపా మినిస్ట్రీస్ అధ్యక్షులు పాస్టర్ పి.మహేష్, సిస్టర్ శాంతమ్మ తాలూకా పోలీస్ స్టేషన్‌లో సిఐగా బాధ్యతలు చేపట్టిన టి.రెడ్డప్పను గురువారం గౌరవ పధంగా కలిసి ఆధ్యాత్మిక పుస్తకాన్ని, కరపత్రాన్ని అందించి ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సిఐ టి.రెడ్డప్ప మాట్లాడుతూ నగరంలో పాస్టర్ మహేష్ సేవలు సామాజిక సేవలు అభినం దనీయమన్నారు. కార్యక్రమంలో పి.రవితేజ, ఏ అగస్టిన్, శాంతిరాజు, రోజా పాల్గొన్నారు.

సిపిఎస్ ఉద్యోగులకు డిఎ బకాయిలు చెల్లించాలి

ప్రజాశక్తి-కాశినాయన

సిపిఎస్ ఉద్యోగులకు డిఎ బకాయిలు చెలించాలని ఎస్‌టియు సిపిఎస్ కన్వీనర్ యు. సుబ్రమణ్యం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆదాయపన్ను చెల్లించిన 60 నెలల కరువు భత్యం బకాయిలు, 2023 సంవత్సరంలో గ్రీన్ ఛానల్ ఉన్న 34 నెలల బకాయిలు చెల్లింపు ఊసే లేకపోవడం శోచనీయమన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం స్పందించి నాలుగు లక్షల సిపి యస్ ఉద్యోగ, ఉపాధ్యాయులకు కరువు భత్య బకాయిలు చెల్లించాలని పేర్కొన్నారు. అమోదయోగ్యం కానీ సిపిఎస్, జిపిఎస్, యుపిఎస్ పింఛను పథకాలను రద్దు చేసి పాత పింఛను విధానాన్ని అమలు చేయాలని తెలిపారు.

ఎంఎల్‌హెచ్‌పిలు బహిరంగ క్షమాపణ చెప్పాలి

ప్రజాశక్తి - బద్వేలు

ఎంఎల్‌హెచ్‌పిలు విజయవాడ ధర్నాలో వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖలో కీలకంగా పనిచేస్తూ, తల్లీ బిడ్డల ఆరోగ్యం కోసం అహర్నిశలు కష్టపడుతున్న ఎఎన్‌ఎంలను, సూపర్‌వైజర్లను కించపరిచేలా వ్యాఖ్యానించడం తగదని వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తూ గురువారం పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఎఎన్‌ఎంలు నిరసన తెలిపారు. ముందుగా పట్టణంలోని సురేంద్రనగర్ అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యులు శ్రీనివాసులుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఉద్యోగుల సంఘం బద్వేలు తాలూకా జాయింట్ సెక్రటరీ సుధా దీరావతి, ఎఎన్‌ఎంలు మాట్లాడుతూ ఎంఎల్ హెచ్‌పిలు వారి సమస్యలను ప్రభుత్వానికి తెలియజేసి పరిష్కరించుకోవాలని, అందుకు తాము కూడా సహకరిస్తామని చెప్పారు. అలా కాకుండా రెగ్యులర్ ఎఎన్‌ఎం, సూపర్‌వైజర్లపై అవగాహన లేకుండా నోరు పారేసుకోవడం మంచిది కాదన్నారు. వైద్య ఆరోగ్య శాఖలో ఎఎన్‌ఎంల పాత్ర చాలా కీలకమని పేర్కొన్నారు. ఆఫ్ట్రాల్ ఎఎన్‌ఎంలని, ఎలాంటి పనులు చేతకావని, కనీసం ఇంజక్షన్ కూడా వేయలేరంటూ అహంకారంగా ఎంఎల్‌హెచ్‌పిలు మాట్లా డటం ఏంటని ప్రశ్నించారు. సూపర్‌వైజర్లను అనే స్థాయి వారికి లేదన్నారు. ఔట్ సోర్సింగ్ ఉద్యోగులుగా వచ్చిన ఎంఎల్‌హెచ్‌పిలు ప్రభుత్వంతో పోరాడి సమస్యలు పరిష్కరించుకోవాలని సూచించారు. రెగ్యులర్ సిబ్బంది మీద పెత్తనం చేయాలని చూస్తే ఒప్పుకునేది లేదన్నారు. మరోసారి అవహేళనగా మాట్లాడితే ఊరుకునేది లేదని ఎంఎల్ హెచ్‌పిలను హెచ్చరించారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఉద్యోగుల సంఘం బద్వేలు తాలూకా జాయింట్ సెక్రటరీ సుధా ధీరావతి , ఎఎన్‌ఎంలు నాగలక్ష్మీ, వసుంధర, లక్ష్మీ నారాయణమ్మ, సుబ్బనరసమ్మ, శివకుమారి పాల్గొన్నారు.

ట్యాంకర్ల వద్ద నీటిని పట్టుకుంటున్న రాజీవ్‌నగర్ కాలనీ వాసులు

ట్యాంకర్లతో తాగునీరు సరఫరా

ప్రజాశక్తి - వేంపల్లె

స్థానిక రాజీవ్‌నగర్ కాలనీలో నీటి అవసరాలు తీర్చేందుకు ట్యాంకర్లతో సరఫరా చేశారు. 4 నెలలుగా రాజీవ్‌నగర్ కాలనీలోని ప్రజలకు నీటి సరఫరా జరగలేదని బుధవారం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద మహిళలు ఖాళీ బిందెలతో నిరసన చేసిన విషయం తెలిసిందే. ఇందుకు స్పందించిన సర్పంచ్ రాచినేని శ్రీనివాసులు గురువారం ట్యాంకర్లతో తాగునీటిని పంపించారు. కాలనీ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. వేసవిలో బోర్లు ఎండిపోవడంతో తాగునీటి ఇబ్బందులు తలెత్తినట్లు సర్పంచ్ రాచినేని శ్రీనివాసులు తెలిపారు. పైపులైను కూడా మరమ్మతులు చేసి తాగునీరు మురికినీటిలో కలుషితం కాకుండా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. భూగర్భ జలాలు అడుగంటిన బోర్ల ప్రదేశంలో కొత్త బోర్లు వేసేందుకు అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. బోర్లల్లో మరిన్ని పైపులు వేసి నీటి సమస్య లేకుండా చూడాలని సర్పంచ్ సిబ్బందికి సూచించారు.

అవగాహన కల్పిస్తున్న దేవేందర్‌రెడ్డి

కూలీలకు సంపద సృష్టిపై అవగాహన

ప్రజాశక్తి - ఖాజీపేట

ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని తడిపొడి చెత్త ద్వారా సంపద సృష్టించవచ్చని రిసోర్స్ పర్సన్స్ అధికారి దేవేందర్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని భూమాయపల్లెలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథక శ్రామికులకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చెత్త సేకరణపై అవగాహన కల్పిస్తూ సంపద సృష్టి గురించి వివరించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులు, ఉపాధి హామీ పథకం క్షేత్ర సహాయకుడు బాబు, గ్రామస్తులు పాల్గొన్నారు.

విద్యార్థిచే జ్యోతి ప్రజ్వలన చేయిస్తున్న కళాశాల యాజమాన్యం

దీపం జ్ఞానం, స్వచ్ఛతకు చిహ్నం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

దీపం జ్ఞానం, స్వచ్ఛతకు చిహ్నమని ప్రిన్సిపల్ డాక్టర్ రామానుజమ్మ తెలిపారు. శ్రీ సాయి రాజేశ్వరి నర్సింగ్ కళాశాలలో గురువారం నర్సింగ్ రెండవ బ్యాచ్ విద్యార్థులకు లాంప్ లైటింగ్ అండ్ ఓత్ టేకింగ్ సెర్మొని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ నర్సింగ్ వృత్తిలో దీపం వెలిగించే వేడుక గణనీయమైన సాంస్కృతిక, ప్రతీకాత్మత ప్రాముఖ్యతను కలిగి ఉంద న్నారు. నర్సింగ్‌లో ఇది విద్యార్థులు వృత్తిలోకి అధికారికంగా ప్రవేశించడాన్ని సూచిస్తుందన్నారు. దీపం వెలిగించడం ద్వారా చెడుపై మంచి, చీకటిపై వెలుగు, అజ్ఞానంపై జ్ఞానం సాధించిన విజయాన్ని సూచిస్తుందన్నారు. కార్యక్రమంలో నర్సింగ్ కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చైర్మన్ బసిరెడ్డి రాజేశ్వర రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ వీరకుమార్ రెడ్డి, కరస్పాడెంట్ వీరకల్యాణ్ రెడ్డి విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు.

మైనార్టీ కార్పొరేషన్ రాయితీ రుణాలు మంజూరు

ప్రజాశక్తి - ముద్దనూరు

2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మైనార్టీ కార్పొరేషన్ ద్వారా ప్రభుత్వం రాయితీ రుణాలు మంజూరు చేసినట్లు ఎంపిడిఒ ముకుందరెడ్డి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇందుకు సంబంధించి ముస్లింలు, బౌద్ధులు, జైనులు, సిక్కులు, పార్శీకులు అర్హులన్నారు. వీరు ఆన్‌లైన్ ద్వారా దరఖాసు చేసుకోవాలన్నారు. మొదటి స్లాబ్ కింద కిరాణా షాపు, చికెన్, మటన్ షాపు, ఎలక్ట్రికల్ రిపేర్, సైకిల్ షాప్, ఫ్రూట్ స్టాల్స్ యూనిట్లకు రూ.లక్ష వరకు రుణం అందిస్తుందన్నారు. రెండవ స్లాబ్ కింద ఫ్రిడ్జ్ రిపేర్, ఆటో మొబైల్ స్పేర్ యూనిట్స్, బ్యాటరీ ఛార్జింగ్ యూనిట్, సెల్‌ఫోన్ రిపేర్, సేల్స్, చెప్పుల షాపు, ఫ్యాషన్ డిజైన్, బ్యూటీ పార్లర్ యూనిట్లకు రూ.3లక్షలు రుణం పొందవచ్చన్నారు. మూడవ స్లాబ్ కింద ఆటో మొబైల్, రవాణా రంగం, ఫ్యాబ్రికేషన్ యూనిట్లు ఏర్పాటు చేసుకునేందుకు రూ.5లక్షల వరకు రుణం మంజూరు చేస్తుందన్నారు. మండలానికి 8 యూనిట్లు యాభై శాతం రాయితీతో మంజూరైనట్లు ఎంపిడిఒ తెలిపారు. యూనియన్ బ్యాంకు-4, ఎపిజిబి-2, స్టేట్ బ్యాంకు-2 యూనిట్లు మంజూరైనట్లు ముకుందరెడ్డి చెప్పారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

ప్రజాశక్తి - సింహాద్రిపురం

ప్రతి వాహనదారుడు తమ వాహనానికి సంబంధించిన రికార్డులను తప్పనిసరిగా ఉంచుకోవాలని ఇన్‌ఛార్జి ఎస్ఐ విష్ణు నారాయణ సూచించారు. గురువారం మండలంలోని నిడివెలగల సమీపంలో వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలను పాటించాలన్నారు. పిల్లలకు వాహనాలు ఇవ్వద్దని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠినచర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. అనంతరం రికార్డుల్లేని వాహనాలకు జరిమానా విధించారు.

రికార్డులను పరిశీలిస్తున్న ఇన్‌ఛార్జి ఎస్ఐ విష్ణు నారాయణ